

ఇది కదా అభివృద్ధి

మా ఊళ్లకు.. నీళ్లొచ్చాయ్!

- ఎన్నో ఏళ్ల తాగునీటి సమస్యకు చెక్
- కార్పొరేటర్ కృషి ఫలితం
- 77వ వార్డులో విరివిగా కుళాయిలు

నాడు

అది జీవీఎంసీ 77వ వార్డు.. **ఈ ప్రాంతం విశాఖ నగరానికి** దూరంగా ఉంటుంది.. అలాగ**ని ఏజెన్సీ ప్రాంతం కాదు..** మైదాన ప్రాంతమే.. ఆ వార్డు **పరిధిలో మొత్తం 32 గ్రామాలు** ఉన్నాయి. ఒకప్పుడు పంచాయ**తీగా ఉన్నప్పుడు తాగునీటి** కోసం ఇబ్బందులు పడేవారు. తర్వాత కాలంలో ఈ ప్రాంతాన్ని గ్రేటర్ విశాఖలో విలీనం చేశారు.. దీంతో తమ ప్రాంతం దశ మారుతుందని.. కనీస సదుపాయాలకు కొదవ ఉండదని అనుకున్నారు.. కానీ వారి ఆశలు అడియాసలే అయ్యాయి. ఈ ప్రాంతంలో ఉన్న గ్రామాల్లో ఒక్క గ్రామంలో కూడా తాగునీటి కుళాయిలు లేకపోవడం.. ఇదే ప్రాంతంలో ఉన్న పరిశ్రమల కారణంగా భూగర్భ జలాలు కలుషితం కావడంతో వీరి పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డ చందంగా తయారైంది. బోర్లున్నా.. నిత్యం నీటి కోసం దూరప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. వ్యయప్రయాసలకు ఓర్చి.. చేతి చమురు వదిలించుకుని నీటిని తీసుకువచ్చేవారు.. ఈ నేపథ్యంలో దాహంతో అల్లాడే జనం కోసం జీవీఎంసీ అధికారులు ప్రతి రోజూ ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయాల్సి వచ్చేది.

నేడు

ఇప్పుడు అక్కడి పరిస్థితి పూర్తిగా మారిపోయింది.. కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి కృషి ఫలించింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తాగునీటి సమస్య పరిష్కరించింది. అధికారులు సైతం ఆ వార్డుకు తాగునీటిని అందించేందుకు చర్యలు చేపట్టారు. ప్రతి గ్రామంలో ఉన్న ఇళ్లకు నేరుగా తాగునీటిని అందించేందుకు విరివిగా కుళాయిలను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా మసీదులు, ఆలయాల్లో కూడా తాగునీటి కుళాయిలను ఏర్పాటు చేయడంతో స్థానిక ప్రజలు అక్కడ కూడా నీటిని పట్టుకుంటూ దాహం తీర్చుకుంటున్నారు.



కొత్తగా ఏర్పాటు చేసిన కుళాయి వద్ద నీటిని పట్టుకుంటున్న ప్రజలు



వ్యక్తిగత కుళాయి వద్ద నీటిని పట్టుకుంటున్న స్థానికులు

పెదగంట్యాడ: జలమే జీవనాధారం.. మనుషులే కాదు.. పశుపక్ష్యాదుల మనుగడకు ప్రధాన ఆధారం. అటువంటి నీటి కోసం ఎన్నో ఏళ్లుగా అవస్థలు పడిన జనం ఇప్పుడు ఉపశమనం పొందుతున్నారు. మంచి నీటి కోసం మొహం వాచిపోయి.. అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఫలితం లేని సమయంలో తమ ఊళ్లకు నీళ్లొచ్చాయంటూ సంతోషంగా ఉంటున్నారు. ఈ ప్రాంతం నగరానికి దూరంగా ఉండడంతో ఇక్కడ కుళాయిలు ఏర్పాటు చేయడానికి ఇబ్బందులు ఎదురయ్యేవి. పైపులైన్లు కూడా అందుబాటులో లేకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో అక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న పరిస్థితిపై ఆందోళన చెందిన కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి ఈ సమస్యను నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారితో పాటు జీవీఎంసీ ఉన్నతాధికారులకు వినతి పత్రాలు అందజేశారు.

స్పందించిన అధికారులు అక్కడ పరిస్థితిని స్వయంగా పరిశీలించి.. జనం అవస్థలను గుర్తించి.. ఆయా గ్రామాలకు నేరుగా పైపులైన్లు వేయించి.. ప్రతి ఇంటికి కుళాయిలు ఏర్పాటు చేశారు. జనం దాహాన్ని తీరుస్తున్నారు.

1200 కుళాయిల ఏర్పాటు

జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని మొత్తం 32 గ్రామాలు ఉండగా అందులో నమ్మిదొడ్డి, మదీనా బాగ్, ఇస్లాంపేట, పలికిలవానిపాలెం, అప్పికొండ, దేవాడ, పిట్టవానిపాలెం, పాలవలస, పెదపాలెం, చినపాలెం, వెలంపేట తదితర గ్రామాలకు మొత్తం 1200 కుళాయిలను ఏర్పాటు చేశారు.

రూ.1.40 కోట్లతో..

ఈ వార్డులోని గ్రామాలకు తాగునీరు అందించేందుకు జీవీఎంసీ రూ.1.40 కోట్లను ఖర్చు చేసింది.

వార్డు : 72
మొత్తం గ్రామాలు : 31
కుళాయిలు : 1,200
మొత్తం నిధులు : రూ.1.40 కోట్లు
టెండర్ల దశలో : రూ.35లక్షల విలువగల పనులు

పైపులైన్‌ను కొత్తగా ఏర్పాటు చేశారు. ఇంటింటికీ కనెక్షన్లు ఇచ్చారు. రోజూ నీటిని సరఫరా చేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో ప్రజర్ తక్కువగా ఉండడంతో కుళాయిల నుంచి నీరు కొద్దిగా వస్తుంది. దీంతో అక్కడ ప్రజర్ పెంచేందుకు మోటార్లు బిగించేందుకు, కొత్తగా కుళాయి కనెక్షన్లు ఇచ్చేందుకు అధికారులు రూ.35లక్షలను మళ్లీ మంజూరు చేశారు. త్వరలోనే ఈ పనులు చేపట్టేందుకు టెండర్లను ఆహ్వానించారు.

తాగునీటి సమస్య తీరింది



తాగునీటి కోసం రోజూ అల్లాడేవాళ్లం.. ఇప్పుడు ఇంటింటికీ కుళాయిలు వేయడంతో మా కష్టాలు తీరిపోయాయి. పేదవాళ్ల కోసం పబ్లిక్ కుళాయిలు కూడా వేశారు. అక్కడ అందరూ నీళ్లు పట్టుకుంటున్నారు..

–పిలక సంధ్య, పిట్టవానిపాలెం

దాహం తీర్చారు



నీళ్లు లేకపోతే ఇంట్లో ఏ పనీ పూర్తి కాదు.. గొంతు తడుపుకోవడానికి కూడా మంచినీరు ఉండేది కాదు. బోర్ల నుంచి వచ్చే నీరు కలుషితమైంది. ఇప్పుడు కుళాయిలు వేసి మా దాహం తీర్చారు.

–బట్టు సావిత్రి, పాలవలస

అన్ని గ్రామాలకు సరఫరా



77వ వార్డు పరిధిలోని కుళాయిలు లేకపోవడంతో జనం అవస్థలు పడేవారు. ఈ నేపథ్యంలో కోట్లాది రూపాయలతో పైప్‌లైన్ పనులు చేపట్టాం. అన్ని గ్రామాలకు స్వచ్ఛమైన నీరు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నాం.

–రాజ్‌కుమార్, ఏఈ, నీటిసరఫరా విభాగం, జీవీఎంసీ

కష్టాలను కళ్లారా చూశా..



ప్రజల కష్టాలను కళ్లారా చూశాను. వార్డులో ప్రధాన సమస్య తాగునీరు.. అందుకే ఆ అంశంపై కౌన్సిల్‌లో చర్చించి, నిధులు రప్పించి అన్ని గ్రామాలకు నేరుగా తాగునీటిని అందిస్తున్నాం. వార్డులోని అన్ని గ్రామాల్లో ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

–బట్టు సూర్యకుమారి, కార్పొరేటర్, 77వ వార్డు

క్లుప్తంగా

నేడు ఉక్కు శివాలయంలో మహా సమారాధన



పూజల్లో పాల్గొన్న ఆలయ కమిటీ ప్రతినిధులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం మహా సమారాధన ఏర్పాటు చేశారు. కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా ఏర్పాటు చేస్తున్న ఈ కార్యక్రమంలో సుమారు 10 వేల మంది భక్తులు పాల్గొంటారని భావిస్తూ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి ఆదివారం ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందులో భాగంగా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉమా రామలింగేశ్వరులకు ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు భద్రు నాయక్, ఎల్లేటి శ్రీనివాసరావు, సురేంద్ర, కనకరెడ్డి, చీకటి శ్రీనివాస్, కాళిదాస్, మోహన్‌రావు, లలితారావు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన సత్యసాయి చిన్నారులు



మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు, చిన్నారులు

ఉక్కునగరం: స్థానిక సత్యసాయి సేవా సమితికి చెందిన యువత, చిన్నారులు ఆదివారం మొక్కలు నాటారు. ఆంధ్రప్రదేశ్ అంతటా కోటి మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా సత్యసాయి ప్రేమతరువు కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా సత్యసాయి మందిరం పరిసరాల్లో ఔషధ మొక్కలు నాటారు. అంతకు ముందు సత్యసాయికు పూజలు చేశారు. కార్యక్రమం ఉక్కునగరం చిన్నారులు, సమితి పదాధికారులు, మహిళా విభాగం ప్రతినిధులు, యువత పాల్గొన్నారు.

ఘనంగా లక్ష రుద్రాక్ష పూజ



ఉక్కు అయ్యప్ప ఆలయంలో లక్ష రుద్రాక్ష పూజ

ఉక్కునగరం: స్థానిక అయ్యప్ప స్వామి దేవాలయంలో లక్ష రుద్రాక్ష పూజ ఘనంగా జరిగింది. కార్తీక బహుళ త్రయోదశి సందర్భంగా ఏర్పాటు చేసిన పూజ శాస్త్రోక్తంగా ప్రారంభమైంది. ఆలయ ప్రధాన అర్చకులు నాగేశ్వర శర్మ నేతృత్వంలో పలువురు రుత్వికులు రుద్రాక్ష పూజ చేశారు. అంతకుముందు అయ్యప్పస్వామికు ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అయ్యప్ప స్వాములు, భక్తులు పెద్ద ఎత్తున పూజలో పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు

అక్కిరెడ్డిపాలెం: గాజువాకలోని సన్ రైజ్ చిన్నపిల్లల ఆస్పత్రిలో చిన్నపిల్లకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 150 మంది చిన్నపిల్లలకు ఉచిత రక్తపరీక్షలు నిర్వహించారు. గాజువాక, పరవాడ, కరాస, సుజాతానగర్‌లలో ఆస్పత్రి బ్రాంచ్‌లలో కూడా వైద్య శిబిరాలు నిర్వహించినట్టు ఆస్పత్రి యాజమాన్యం తెలిపింది. రెండు రోజుల పాటు ఉచిత వైద్య శిబిరాలు కొనసాగుతాయన్నారు.

శరవేగంగా అభివృద్ధి పనులు



66వ వార్డులో శిలా ఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక : నియోజకవర్గంలోని అన్ని వార్డుల్లోను అభివృద్ధి పనులను శరవేగంగా పూర్తి చేస్తున్నామని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. 66వ వార్డులోని బీసీ రోడ్-1, అజీమాబాద్, నవాబ్‌నగర్, కైలాసనగర్ సచివాలయాల పరిధిలో నూతన రోడ్లు, కాల్వల నిర్మాణానికి ఆదివారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యతనిచ్చామన్నారు. రోడ్లు, కాలువలు సరిగా లేకపోవడంవల్ల భారీ వర్షాల సమయంలో ప్రజలు ఇబ్బందిని ఎదుర్కొంటున్నారన్నారు. ఈ సమస్యలు పునరావృతం కాకుండా ఉండటం కోసం వివిధ చర్యలను చేపట్టామన్నారు. వార్డు కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్ మాట్లాడుతూ నాలుగు సచివాలయ పరిధిలో రూ.80 లక్షలతో రోడ్లు, కాలువలను నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ క్లస్టర్ అధ్యక్షుడు ఎస్ఎండీ గౌస్, నాయకులు దుబాయ్ బాషా, పెదిరెడ్ల ఈశ్వరరావు, కరణం వేణుగోపాల్, కర్రి జగన్ మోహన్, షఫీ, పేరం రామకృష్ణారెడ్డి, రెడ్డి జగన్నాథం, ఎడ్ల రాజు, నజీర్, ఖాజా, దేముడుబాబు, నన్న, జలాల్, అస్మత్ అలీ, షేక్ ఆశ, కోరుకొండ పద్మ, ఉమాదేవి, షకీలా తదితరులు పాల్గొన్నారు.

తిరుమల బాలాజీ దివ్యక్షేత్రానికి దాతల సాయం



తిరుమల బాలాజీకి ఆభరణాల నిమిత్తం రూ.80 వేల చెక్కును అందజేస్తున్న దృశ్యం



రూ.10,116 అందజేస్తున్న ప్రకాశరావు, శ్రీలక్ష్మి దంపతులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్‌లోని ఎస్టీబీఎల్ ప్రాంగణంలో కొలువైన శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో తిరుమల బాలాజీకు వివిధ రూపాల్లో దాతలు భారీగా విరాళాలు అందజేస్తున్నారు.సత్యవేణి గోదావరి లేఅవుట్‌కు చెందిన పవన్ దంపతులు బాలాజీకి ఆభరణాల నిమిత్తం రూ.80 వేల చెక్కును దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులకు అందజేశారు. స్వామి వారి గరుడ వాహన సేవకు ప్రకాష్ రావు, శ్రీలక్ష్మి దంపతులు రూ.10,116లు అందజేశారు. శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ సభ్యుల ఆధ్వర్యంలో విరాళాల సేకరణ జరిగింది.

మానవ హక్కుల పరిరక్షణకు కృషి



మాట్లాడుతున్న జీవీఎంసీ జెడ్సీ సింహాచలం

అగనంపూడి: మానవ హక్కుల పరిరక్షణకు గ్లోబల్ వుమెన్ రైట్స్ అసోసియేషన్ కృషి చేస్తుందని ఆ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు కాసుల కోనయ్య అన్నారు. మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా అగనంపూడిలోని జీవీఎంసీ కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బానిస బతుకుల నుంచి అట్టడుగు వర్గాలకు విముక్తి కలగాలని, ఆనాడే మానవ హక్కుల దినోత్సవానికి అర్థం ఉంటుందన్నారు. గాజువాక జోనల్ కమిషనర్ పొందూరు సింహాచలం మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు కావస్తున్నా నేటికీ మానవ హక్కుల మీద సామాన్యులకు అవగాహన లేదని, ఈ అసోసియేషన్ మానవ హక్కులపై అవగాహన కల్పించాలన్నారు. తరువాత సామాజిక సేవలు అందిస్తున్న వివిధ వర్గాలకు చెందిన వారిని సత్కరించారు. కార్యక్రమంలో 85, 79 వార్డుల కార్పొరేటర్లు ఇల్లపు వరలక్ష్మి ప్రసాద్, రౌతు శ్రీనివాసరావు, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్, జేసీఎస్ జిల్లా కో ఆర్డినేటర్ జి.పూర్ణానందశర్మ (పూర్ణ), గ్లోబల్ ఉమెన్ రైట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మోటూరి వెంకటరమణ, కార్మిక సంఘాల నాయకులు డి.ఆదినారాయణ, బలిరెడ్డి సత్యనారాయణ, గాజువాక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఐక్య క్రిస్మస్ వేడుకలు

అక్కిరెడ్డిపాలెం: భెల్ ఐక్య క్రిస్మస్ ఈవ్ – 2023 వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి సంస్థ టౌన్‌షిప్‌లోని కళాభారతి ఆడిటోరియంలో జరిగిన వేడుకల్లో పలువురు క్రైస్తవ ప్రముఖులు పాల్గొన్నారు. క్రిస్మస్ ప్రాముఖ్యతను వివరించారు. హైదరాబాద్ నుంచి విచ్చేసిన విశ్వవాణి స్టేట్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఈ.ఆర్.రాబర్ట్ పలు అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో చీఫ్ గెస్ట్ భెల్ ఏజీఎం (హెడ్) ఎం.వి.ఎస్.ఎన్.రాజు, క్రైస్తవ సంఘం అధ్యక్షుడు జోసేఫ్, కార్యదర్శి జాన్ రాజు, రెవరెండ్ డాక్టర్ జాకబ్ ఏ.ఎన్.కుమార్, డాక్టర్ శ్యామ్యూల్ లోపింటి, వై.జ్ఞానలత, ఈ.శ్యామ్యూల్, జి.స్వామినాథన్, ఎన్.జే.సి.బాబు, పి.సుధాకర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు కార్మికుల పోరాట శక్తికి ఎదురుండదు



దీక్షలో పాల్గొన్న కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం : ఉక్కు కార్మికులు తమ జీవితాల కోసం చేస్తున్న పోరాటానికి ఎదురుండదని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ విషయంలో కేంద్ర ప్రభుత్వం దిగి రాక తప్పదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారం 1,032వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన పలువురు కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. టీఎస్‌టీయూసీ కాంట్రాక్ట్ వర్కర్స్‌ను ఉద్దేశించి పోరాట కమిటీ నాయకులు మాట్లాడారు.


అనాథ శవానికి ట్రాఫిక్ పోలీసుల అంత్యక్రియలు



జ్ఞానాపురం శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహిస్తున్న గాజువాక ట్రాఫిక్ పోలీసులు

అక్కిరెడ్డిపాలెం: ఈ నెల 4వ తేదీన గాజువాక పోలీస్ స్టేషన్ ఎదురుగా వంద అడుగుల రోడ్డులో గుర్తు తెలియని వ్యక్తికి గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో వ్యక్తి తీవ్రగాయాలతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ 5వ తేదీన మృతి చెందాడు. అప్పటి నుంచి బంధువులెవరైనా వస్తారేమో అని కేజీహెచ్ మార్చురీలో మృతదేహాన్ని ఉంచారు. ఎవ్వరు స్పందించకపోవడంతో ఆదివారం గాజువాక ట్రాఫిక్ ఎస్సై షేక్ యూసఫ్ సిబ్బందితో కలిసి అనాథ మృతదేహానికి అన్నీ తామై సొంత ఖర్చులతో జ్ఞానాపురం హిందూ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

మనస్థాపంతో వృద్ధుడి ఆత్మహత్య



సత్యనారాయణ (ఫైల్)

పెదగంట్యాడ: మండలానికి చెందిన ఓ వృద్ధుడు మనస్థాపంతో ఆత్మహత్య చేసుకున్నాడు. న్యూపోర్టు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో కాల సత్యనారాయణ (67) భార్య కమలతో కలసి నివాసం ఉంటున్నాడు. ఆయన డాక్‌యార్డ్‌లో ఉద్యోగం చేసి ఉద్యోగ విరమణ పొందారు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉండగా వారికి పెళ్లిళ్లు చేశారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నాడు. ప్రతి రోజూ ఇంటి నుంచి బయటకు వెళ్లి వస్తుంటాడు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం కూడా ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన అతని భార్య భర్తను వెతుక్కొంటూ వెళ్లింది. దారిలో ఆయన కనిపించడంతో అతనిపై ఆగ్రహం వ్యక్తం చేసింది. బయటకు ఎందుకు వెళ్లావంటూ నిలదీసింది. దీంతో కోపంగా బైక్‌పై ఇంటికి వెళ్లిపోయాడు. భార్య ఇంటికి వెళ్లేసరికి ఆయన పడిపోయి ఉన్నాడు. ఏమైందని అడగ్గా పురుగులు మందు తాగినట్టు భర్త చెప్పాడని, వెంటనే బంధువులకు 108కు సమాచారం ఇచ్చినట్టు భార్య కమల తెలిపింది. 108 సిబ్బంది వచ్చి పరీక్షించగా అప్పటికే ఆయన మృతి చెందినట్టు నిర్ధారించారు. భార్య ఫిర్యాదుతో న్యూపోర్టు ఏఎస్ఐ పీఎస్ఎన్ రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

16 నుంచి ధనుర్మాసోత్సవాలు



ప్రసన్న వేంకటేశ్వర స్వామి

పెదగంట్యాడ: వినాయకనగర్ వుడా కాలనీ మామిడితోటలోని పద్మావతి అండాళ్ సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఈ నెల 16 నుంచి ధనుర్మాస ఉత్సవాలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ నెల 16 నుంచి వచ్చే నెల 14 వరకూ ఈ ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నామని వివరించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా స్వామి వారికి ప్రతి రోజూ ఉదయం సుప్రభాత సేవ, ఆరాధన, సేవాకాలం, మంగళాశాసనం, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. ఈ నెల 23న వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించనున్నామన్నారు. ఈ నెల 30న పుష్పయాగం, కోలాటం, సాంస్కృతిక ప్రదర్శనలు, ఊంజల్ సేవ చేయనున్నామన్నారు. వచ్చే నెల 3న దీపోత్సవం, 7న స్వామి వారు నృసింహ అవతారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారన్నారు. అలాగే అభిషేకాలు, కన్నె పిల్లల పూజ ఉంటుందన్నారు. 10న గోదాదేవి అమ్మవారికి పంచామృతాభిషేకం, 11న కూడారై ఉత్సవం, 14న భోగి పండగను పురస్కరించుకుని గోదా రంగనాథుల కల్యాణ మహోత్సవం, 15న మకర సంక్రమణం, 16న కనుమ పండగ ఉంటాయన్నారు.

సంస్థాగతంగా బీజేపీ బలోపేతం

గాజువాక : గాజువాక నియోజకవర్గంలో సంస్థాగతంగా బీజేపీ బలంగా ఉందని ఆ పార్టీ సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ కేశవ్ కాంత్ అడుసుమిల్లి అన్నారు. గాజువాకలో ఆదివారం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గాజువాకలోని 20 వార్డుల్లో పార్టీ బలంగా ఉందని, సోషల్ మీడియాలో కూడా చొచ్చుకుపోవాలని అన్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. సోషల్ మీడియా వేదికగా కూడా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, నాయకులు బొండా ఎల్లాజీరావు, లక్కరాజు సోంబాబు, కట్టా పద్మ, గూటూరు శంకరరావు, కోసూరు తాతారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

అక్కిరెడ్డిపాలెం: తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు గవరజగ్గయ్యపాలెం మరమ్మతులకు గురైంది. రోడ్డుపై గోతులు ఏర్పడడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. దీనిపై స్పందించిన ఎస్టీబీఎల్ యాజమాన్యం రోడ్డు మరమ్మతులకు శ్రీకారం చుట్టింది. విస్టీబీఎల్ ఎస్టేట్ మేనేజర్ జి.గంగా మహేష్ నేతృత్వంలో రోడ్డు మరమ్మతులు నిర్వహించారు.

పేద కుటుంబానికి నిత్యావసర సరుకుల వితరణ

గాజువాక : గాజువాకలోని ఒక పేద కుటుంబానికి అమ్మ వాసవీ సేవా ట్రస్టు ప్రతినిధులు అండగా నిలిచారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పూసర్ల నరసింగరావు కుటుంబానికి ట్రస్టు ప్రతినిధులు రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధి కులుకూరి మంగరాజు ఆ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. నరసింగరావు కుమార్తె బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న నేపథ్యంలో ఈ సహాయం అందించినట్టు సంఘ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రస్టు నాయకులు వరదా కృష్ణ, గునిశెట్టి గుప్త, సింధియా రాము, బత్తుల రమేష్, తీగల రమణాజీ, కందుల సాయి, గోగుల రాంజీ, పూసర్ల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బాక్సింగ్ పోటీలు



ఫైనల్స్ పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

తాటిచెట్లపాలెం: నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు జన్మదినోత్సవంలో భాగంగా ఈ నెల 8న పోర్టు హాస్పిటల్ ఎదురుగా ప్రారంభమైన కేకేఆర్ ట్రోఫీ బాక్సింగ్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, పార్టీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, కె.కె.రాజు విచ్చేశారు. విశాఖ డిస్ట్రిక్ట్ అమెచ్యూర్ బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరుసగా మూడో ఏడాది జిల్లా మెన్ అండ్ వుమెన్ సబ్ జూనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్–2023ను నిర్వహించారు.